
2 నుంచి బళ్లారి రాఘవ జయంత్యుత్సవాలు
● సిద్ధమవుతున్న రాఘవ కళామందిర్ ● తెలుగు, కన్నడ కళాకారులకు రాష్ట్రస్థాయి అవార్డులు

తీయని లాభాలు
● ఖర్జూరాల సాగుతో రూ.లక్షలు గడిస్తున్న రైతు
8 ● సౌదీ దేశాల నుంచి ప్రత్యేక విత్తనాలు



సాంకేతికంగా సర్వే

● అత్యాధునిక టెక్నాలజీతో రాష్ట్రంలో కులగణన ● ముందే మొబైల్‌కు మెసేజ్.. పూర్తయిన ఇంటికి జియో ట్యాగింగ్ ● 60 ప్రశ్నలు.. ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సమాచారం ● రూ.600 కోట్ల ఖర్చు

బెంగళూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం రెండోసారి సామాజిక, విద్య, ఆర్థిక వివరాలు సేకరించేందుకోసం చేపట్టిన కులగణనలో సంపూర్ణ సాంకేతికత ఉపయోగించనున్నారు. గత కులగణన గత సర్వేలో తమ ఇంటికి రాలేదని, తమ నుంచి సమాచారం సేకరించలేదనే ఆరోపణలు పలు ప్రాంతాల్లో వచ్చాయి. దీంతో పారదర్శక జనస్నేహి సర్వేకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. కులగణన సర్వేతోపాటు నివేదిక తయారు చేసేందుకు సాంకేతికతను గరిష్ఠంగా సద్వినియోగం చేసుకోవాలని బీసీ కమిషన్ సిద్ధమవుతోంది. ఇందుకోసం అనుభవం కల్గిన ప్రైవేట్ సంస్థలతోనూ చర్చలు జరపనున్నారు. ఇంటింటికీ సమీక్షకు మొబైల్ టెక్నాలజీని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. సర్వే తర్వాత ప్రతి ఇంటికీ జియో ట్యాగింగ్ అనుసంధానం చేయనున్నారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లో సమగ్ర సమాచారం నమోదు చేయనున్నారు. కులగణన సర్వేకు ఉపాధ్యాయులను ఎక్కువమందిని సద్వినియోగం చేసుకోదలిచారు. 15రోజుల్లోనే సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న మేరకు వారికి తగిన శిక్షణతోపాటు వారు ఎదుర్కొనే సమస్యలపై అనుసంధాన ప్రక్రియ వ్యవస్థకు బీసీ కమిషన్ ఆలోచిస్తున్నట్లు బీసీ సంక్షేమసంఘం ముఖ్య అధికారులు తెలిపారు.

మొబైల్‌కు సందేశం

ఇక సర్వేకు వెళ్లడానికి ముందే ఆయా ఇంటికీ ముందస్తుగానే మొబైల్ సందేశం పంపనున్నారు. అవసరమైన వివరాలను సిద్ధం చేసుకోవాలని, సర్వేకు సహకరించాలని అందులో కోరుతారు. సామాజిక, విద్య మాత్రమే కాకుండా ఆర్థిక సర్వే అయినందున ఉద్యోగం, భూములు వారికి సంబంధించిన ఇతరత్రా వివరాలను సేకరిస్తామని బీసీ సంక్షేమ సంఘం పేర్కొంది.

తెలంగాణకు అధికారుల బృందం

తెలంగాణలో జరిపిన సర్వే అధ్యయనం కోసం బీసీ కమిషన్ ఛైర్మన్, బీసీ సంక్షేమశాఖ కార్యదర్శితో కూడిన నలుగురి బృందం సోమవారం తెలంగాణకు బయల్దేరారు. వారు కొన్నిరోజులపాటు తెలంగాణలో పర్యటించి అక్కడి ప్రభుత్వం కులగణన జరిపిన విధానాన్ని సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు. వారు రూపొందించిన దరఖాస్తు, సాంకేతిక సహకారం, ఇంటింటి సర్వేలో వారు ఎదుర్కొన్న సమస్యలు, క్రోడీకరణ ప్రక్రియ వంటి అంశాలపై అధ్యనం చేయనున్నారు. తెలంగాణలో అమలు చేసిన సర్వేపట్ల కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సంతృప్తి వ్యక్తం చేసిన తరుణంలో, రాష్ట్ర అధికారుల బృందాన్ని తెలంగాణకు పంపించి సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం సిద్దరామయ్య సూచించారు. అందుకు అనుగుణంగానే అధికారుల బృందం హైదరాబాద్‌కు వెళ్లింది.

వారం రోజుల్లోనే వివరాలు

రాష్ట్రంలో మతాలు, కులాలు, ఉపకులాల వివరాల సమాచారం మరో వారం రోజుల్లోగా బీసీ కమిషన్ సోషల్‌మీడియాలో ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. ప్రజలు వివరాలను పరిశీలించి కులాలు, ఉపకులాలతో పాటు ఇతరత్రా అభ్యంతరాలు, సలహాలు ఉంటే బీసీ కమిషన్‌కు సర్వేకు ముందుగానే సమర్పిస్తారని అధికారులు భావిస్తున్నారు. తద్వారా సర్వే జరిపేవేళ గందరగోళానికి అవకాశం ఉండదు.

కీలక అంశాలు

సర్వేలో 58నుంచి 60 ప్రశ్నలతో ఒక నమూనా తయారు చేయనున్నారు. సర్వే పూర్తయిన ఇంటికి ప్రత్యేక గుర్తింపు నెంబర్ ఇవ్వనున్నారు. సమగ్ర సమాచారం సేకరించిన తర్వాతనే సర్వే ప్రక్రియ పూర్తిచేసినట్లు భావిస్తారు. సమాచార పరిష్కారానికి ప్రత్యేక కాలంను దరఖాస్తులో ఏర్పాటు చేయనున్నారు. కుటుంబ సభ్యుల పేర్లు సమగ్రంగా నమోదు చేస్తారు. ప్రతి ఇంటి సమాచార సేకరణకు కనీసం అరగంట సమయం పడుతుందని భావిస్తున్నారు. సర్వే చేసే వారు రోజుకు 10-12 ఇళ్లను పూర్తి చేయవచ్చునని అంచనా వేస్తున్నారు. సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులకు 15రోజులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని నిర్ణయించార. సర్వే సమాచారం గతంలో జరిపినవాటితో సమీకరణ చేయనున్నారు. సెలవురోజుల్లో పర్యటనకు వెళ్లేందుకు వీలుగా పనిరోజుల్లోనే సర్వే పూర్తి చేయాలని నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో రికార్డుల వివరాలతోపాటు సమాచారం ఇవ్వవచ్చు. విదేశాలలో స్థిరపడినవారు, వలసలు వెళ్లినవారికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రతిరోజూ సర్వేకు సంబంధించిన సమాచారం ఆన్‌లైన్‌లో కమిషన్‌కు పంపదలిచారు.

రూ.600 కోట్లకు నివేదిక

కులగణన సర్వే సమగ్రంగా పూర్తి చేసేందుకు కనీసం రూ.600 కోట్ల రూపాయలు ఖర్చు కానుందని బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులు ఓ నివేదికను బీసీ సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ తంగడగికి రెండు రోజుల క్రితం సమర్పించారు. సదరు ప్రస్తావనలను ముఖ్యమంత్రి ద్వారా మంజూరు చేయించి 600 కోట్ల రూపాయల ప్రస్తావనకు అంగీకారం సాధిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. సర్వే తుది ప్రక్రియలో కొంత మార్పులు జరిగితే అదనంగా గ్రాంట్లను మంజూరు చేసేందుకు కూడా సిద్ధమవుతున్నారు.

బెంగళూరుపై ప్రత్యేక దృష్టి

మొబైల్ యాప్, ఆన్‌లైన్‌లో సమాచారం సమర్పించేందుకు అవకాశం కల్పించిన తర్వాత కూడా బెంగళూరులో పలు సవాళ్లు ఎదురయ్యాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని బెంగళూరు పట్ల ప్రత్యేకదృష్టి సారించాలని భావిస్తున్నారు. బీసీ కమిషన్ సన్నాహకసభలో ప్రత్యేక పథకం రూపొందించేందుకు చర్చించదలిచారు. పాలికెలో లభించే, అవసరమైన వివరాలను పొందదలిచారు. తద్వారా సర్వే వేళ ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. సర్వేను మూడు స్టేజ్‌లుగా అమలు చేయదలిచారు. సమగ్ర వివరాలు సేకరించడం, గణాంకాలు ఉద్యోగ, ఆర్థిక తదితర అంశాలపై సమగ్ర వివరాలు నమోదు చేయించడం, ఉలాలు, ఉపకులాల విషయంలో సమగ్రమైన వివరాలు నమోదు చేయించదలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా 15రోజుల్లో ముగించాలని నవంబరులో సమర్పించాలని బీసీ కమిషన్ భావిస్తోంది. అయితే 15రోజుల్లో సర్వే చేయడం అనేది అసాధ్యమైన ప్రక్రియ అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రెండు సర్వేల అనుభవం

రాష్ట్రంలో రెండు సర్వేలు జరిగాయి.
2015లో రాష్ట్రంలో వ్యాప్తంగా కులగణన సర్వే చేశారు. సర్వే తర్వాత క్రోడీకరించుకునేందుకు ఏళ్ల తరబడి సమయం పట్టింది. ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు బీసీ కమిషన్ సిద్ధమైనా కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో అప్పటి సీఎం కుమారస్వామి, ఆ తర్వాత బీజేపీ సీఎంలు యడియూరప్ప, బసవరాజ్ బొమ్మైలు తేనెతుట్టెను కదిపినట్లు అవుతుందని వెనుకడుగు వేశారు. ఇలా కారణం ఏదైనా సర్వే జరిగి పదేళ్లు అయ్యిందని, కాంగ్రెస్ అధిష్ఠానం సూచించిందనే కారణాలతో గత సర్వేను పూర్తిగా విస్మరించారు. లింగాయత, వీరశైవ, ఒక్కలిగ సామాజికవర్గం ఆ సర్వేను తీవ్రంగా వ్యతిరేకించాయి. దీనికి తోడు వంద శాతం సర్వే కాలేదని ప్రభుత్వం కమిషన్ కూడా ప్రకటించింది. కాగా ఇటీవల ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ప్రత్యేకంగా సర్వే జరిగింది. ఇచ్చిన గడువు కంటే ఏకంగా మూడుసార్లు గడువు పొడిగించాల్సి వచ్చింది.

మొదలయ్యేది ఎప్పుడు..?

ప్రతిష్ఠాత్మకమైన కులగణన సర్వే సెప్టెంబరు 22నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు చేపట్టాలని నిర్ణయించారు. అంతిమ నివేదిక సమర్పించేందుకు అక్టోబరు చివరినాటికి ప్రభుత్వం గడువు ఇచ్చింది. అందుకు తగ్గట్టుగా బీసీ కమిషన్ ఏర్పాటు చేసుకుంటోంది. రెండు నెలలపాటు బీసీ కమిషన్ అధికారులు, ఉద్యోగులను సెలవు రోజుల్లోనూ పనిచేసేలా ఇప్పటికే సూత్రప్రాయంగా ఆదేశించారు. అయితే సర్వే జరిగిన తర్వాత క్రోడీకరణ ప్రక్రియకు కనీసం రెండు నెలల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. దీన్నిబట్టి కనీసం నవంబరు నాటికి సర్వే పూర్తి కావచ్చుననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

బీజేపీ యశ్వంతపుర అభ్యర్థిగా రుద్రేశ్

● ప్రకటించిన యడియూరప్ప



బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో మూడేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగనుంది. కానీ బీజేపీ అగ్రనేత యడియూరప్ప యశ్వంతపుర నియోజకవర్గానికి ఎం రుద్రేశ్ అభ్యర్థిగా సోమవారం ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఒకరోజు బెంగళూరు పర్యటనకు వచ్చిన తర్వాత యడియూరప్ప రాజకీయాల్లో క్రియాశీలకమయ్యారు. యశ్వంతపుర బీజేపీకి అనుకూలమైన నియోజకవర్గమని, 2028లో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా రుద్రేశ్ పోటీ చేస్తారని ప్రకటించారు. ఇతను గత ప్రభుత్వంలో సంప్రదాయేతర ఇంధన వనరుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. 2023 శాసనసభ ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి గెలుపొందిన ఎస్‌టీ సోమశేఖర్ కాంగ్రెస్‌వైపు వెళ్లారు. దీంతో ఇప్పటినుంచే నియోజకవర్గంలో క్రియాశీలకంగా వ్యవహరించేలా రుద్రేశ్‌కు సూచించారు. 2008 వరకు యశ్వంతపుర ప్రాంతం ఉత్తరహళ్ళి నియోకవర్గంలో ఉండేది. అప్పట్లో శోభాకరంద్లాజె ఓసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత ఎస్‌టీ సోమశేఖర్ వరుసగా విజయం సాధిస్తూ వచ్చారు.

మట్టి తినే దుస్థితికి తెచ్చారు..!

● అందరికీ అన్నం పెట్టే రైతులకు ఆకలిచావులు ● యూరియా లేదు.. ఏడాదిన్నరలో 980 మంది ఆత్మహత్య
● సిద్దరామయ్యను మైసూర్ ఒడయార్‌తో పోల్చడం సిగ్గుచేటు: మాజీ మంత్రి శ్రీరాములు ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు, రైతు సంఘం నాయకులు

బళ్లారి, జూలై28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత తీవ్రం అయ్యింది.. అందరికీ అన్నం పెట్టే రైతు కొప్పళ జిల్లాలో మట్టితిన్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడాదిన్నర కాలంలో 980 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటూ మాజీ మంత్రి శ్రీరాములు ప్రభుత్వంపై మండిపడ్డారు. సోమవారం బళ్లారిలోని తన నివాసంలో రైతు సంఘం నాయకులు దరూరు పురుషోత్తమగౌడ, జిల్లా ఫర్టిలైజర్స్ యజమానుల సంఘం అధ్యక్షుడు ఐనాత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోకా అనీల్ తదితన బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న రైతులకు కనీసం పరిహారం కూడా ఇవ్వలేదని, మైసూర్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు ఎందుకు జరుపుకుంటుందో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. ఏటా అతివృష్టి, అనావృష్టి లతో అన్నదాత విలవిలలాడుతున్నారన్నారు. రైతులకు యూరియాలు దొరక్క మట్టితింటూ నిరసన వ్యక్తం చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం పంపే యూరియాను రాష్ట్రంల శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు అక్రమంగా పంపిస్తోందని ఆరోపించారు. సిద్దరామయ్య కుమారుడు యతేంద్ర తండ్రిని మైసూర్ రాజు ఒడయార్‌తో పోలుస్తూ డబ్బాలు కొట్టుకోవడం సిగ్గు చేటన్నారు. రైతుసంఘ నాయకుడు పురుషోత్తమ గౌడ, ఐనాత్‌రెడ్డి తదితరులు ప్రభుత్వంపై మండిపడ్డారు.

రేపటి నుంచి ఎమ్మెల్యేలతో భేటీలు

● వరుస సమావేశాలకు సిద్ధమైన సీఎం
● నియోజకవర్గ సమస్యలపై ఆరా



బెంగళూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): నాయకత్వ మార్పు... సుర్జేవాలా సమీక్ష.. ఢిల్లీలో అగ్రనేతలతో వరుస భేటీలు ఇలా నెలరోజుల వ్యవధిలో సంచలనాలు చోటు చేసుకున్న తర్వాత సీఎం సిద్దరామయ్య రంగంలోకి దిగారు. మంగళవారం నుంచి నాలుగురోజులపాటు పూర్తిగా బెంగళూరులోనే ఉంటూ ఎమ్మెల్యేలతో చర్చలు జరిపేందుకు సిద్ధమయ్యారు. ప్రతి ఎమ్మెల్యేకు అరగంట కేటాయిస్తూ వారి నియోజకవర్గ సమస్యలు, గ్రాంట్లు, అభివృద్ధి పనులు, రాజకీయ అంశాలపై చర్చించదలిచారు. ఇటీవలే పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా 9 రోజులపాటు ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దాదాపు 120మంది ఎమ్మెల్యేలతోపాటు మంత్రులు, ఓడిపోయిన అభ్యర్థులు, వివిధ బోర్డులు, కార్పొరేషన్‌ల ఛైర్మన్‌లతో ముఖాముఖి భేటీ అయ్యారు. పలువురు మంత్రులపై వచ్చిన ఆరోపణలను ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఇలా సుర్జేవాలా సమీక్షలు ముగియగానే సీఎం సిద్దరామయ్య సిద్ధమయ్యారు. మంగళవారం మైసూరు, చామరాజనగర, తుమకూరు, కొడగు, హాసన్ ఎమ్మెల్యేల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్ మంత్రులతో భేటీ కానున్నారు. సాయంత్రం 5గంటలకు సమీక్ష జరపనున్నారు. తుమకూరు ఎమ్మెల్యేలతో సాయంత్రం 5.30 గంటల తర్వాత చర్చలు జరిపేలా షెడ్యూల్ విధించారు. హోం మంత్రి పరమేశ్వర్, సహకారశాఖ మంత్రి రాజణ్ణలు పాల్గొననున్నారు. 6.45 నుంచి 7.45 దాకా కొడగు, హాసన్ జిల్లాల ఎమ్మెల్యేలతో చర్చించనున్నారు. ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఎమ్మెల్యేలు, వారి నియోజకవర్గాలకు సంబంధించిన అంశాలను ప్రాధాన్యతపరంగా చర్చించేందుకు సిద్ధమయ్యారు.



కేఎంఎఫ్ నూతన అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాళ్ సోమవారం బెంగళూరులో సీఎం సిద్దరామయ్యను కలిశారు. ఆయనతోపాటు మంత్రి భోసరాజు, పాలకవర్గ సభ్యులు.. సీఎంకు జ్ఞాపిక బహూకరించి ఘనంగా సత్కరించారు.
- బళ్లారి, ఆంధ్రజ్యోతి

ఏనుగుల దాడిలో ఇద్దరి మృతి

● అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
● అటవీ శాఖ కార్యాలయం ముందు నిరసన

బెంగళూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): చిక్కమగళూరు జిల్లా ఎన్‌ఆర్ పుర తాలూకాలో నాలుగురోజుల వ్యవధిలో ఏనుగుల దాడిలో ఇద్దరు మృతి చెందారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అటవీశాఖ కార్యాలయం ముందు వివిధ సమీప గ్రామాల రైతులు సోమవారం అటవీ శాఖ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. గురువారం అనిత (25) అనే మహిళపై ఏనుగు దాడితో మృతి చెందారు. ఆదివారం సుబ్బ రాయగౌడ (65) మృతి చెందారు. మూడగెరె-బేళూరు సరిహద్దులో 25 ఏనుగుల సంచారాన్ని స్థానికులు గుర్తించారు. రోజూ ఏనుగుల దాడి నుంచి భరించలేకపోతున్నామని, ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినా నిర్లక్ష్యం చేస్తున్నారని వారు మండిపడుతున్నారు. బాళె హొన్నూరు, ఖాండ్యా పట్టణాలను సంపూర్ణంగా బంద్ చేసి చిక్కమగళూరు-శృంగేరి రాష్ట్ర రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. కిలో మీటర్ల కొద్దీ వాహనాలు స్తంభించాయి. ఎమ్మెల్యే టీజీ రాజేగౌడ, మాజీ మంత్రి జీవరాజ్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు. ఏనుగుల దాడిలో ఇద్దరు మృతిపట్ల అటవీశాఖమంత్రి ఈశ్వర్‌ఖండ్రె సంతాపం ప్రకటించారు. ప్రభుత్వం అన్నివిధాలా సాయం చేస్తుందని మంత్రి బెంగళూరులో ప్రకటించారు.



కార్యాలయం ముందు నిరసనకు దిగిన రైతులు

నీట మునిగిన బృందావనం

● కంప్లి వద్ద ఉధృతి తగ్గని తుంగభద్ర



ఇటిగీ వద్ద కంప్లి-సిరుగుప్ప రోడ్డుపై రాకపోకలు బంద్

కంప్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదికి అధికంగా నీరు పోటెత్తుతుండడంతో కాలవలు పొంగిపొర్లుతున్నాయి. సోమవారం జల ప్రవాహానికి కంప్లి కోట వద్ద వుండే మాధవతీర్థ బృందావనం నీటిలో మునిగింది. జలాశయం నుంచి లక్ష క్యూసెక్కులపైగా నీటిని విడుదల చేయడంతో కంప్లి కోట వద్ద పొలాల్లోకి నీరు చేరాయి. మత్స్యకారులు తెప్పలను ఒడ్డుకు చేర్చారు. ఇటిగి వద్ద కంప్లి, సిరుగుప్ప రోడ్డుపై నీరు ఎక్కువగా రాకపోవడంతో ఇటిగి ప్రజలు కంప్లికి రావాలన్న ఎమ్మిగనూరుకు వెళ్లి కంప్లికి చేరుకుంటున్నారు. రైతులు కొన్ని ప్రాంతాల్లో తెప్పల్లో పొలాలకు చేరుకుంటున్నారు. ఇటిగి వద్ద కంప్లి, సిరుగుప్ప రాకపోకలు బందయ్యాయి. కంప్లి నుండి గంగావతికి వెళ్లే ప్రయాణికులు బుక్కసాగరం మీదుగా వెళుతున్నారు. ప్రతియేటా కంప్లి కోట వద్ద బ్రిడ్జి మునగడంతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఎప్పుడు నూతన బ్రిడ్జి ఏర్పడుతుందో ఎప్పుడు ఈ సమస్యలు పరిష్కారమవుతాయని ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తెప్పలో వెళ్తున్న రైతులు



నీటిలో మునిగిన మాధవ తీర్థ బృందావనం



కంప్లి కోట వద్ద నీటిలో మునిగిన వంతెన

అత్యాధునిక విద్యాలయం..!



యూనివర్సిటీ ముఖద్వారం


సుందరంగా తీర్చిదిద్దిన రోడ్డు

- అనంతకు వరం సెంట్రల్ యూనివర్సిటీ
- 2018లో ఆరు కోర్సులు..
- వందమంది విద్యార్థులతో ప్రారంభం
- నేడు 26 కోర్సులు, వేలాదిమంది విద్యార్థులు
- అత్యాధునిక భవనాలు, వసతులు
- ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన
- నేడు వర్సిటీని ప్రారంభించనున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

అనంతపురం వైద్యం, జూలై 28(ఆంధ్రజ్యోతి): అధునాతన విద్యకు వేదిక అయిన కేంద్రీయ విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధి చెందుతోంది. చిన్నగా ప్రారంభమై, వందల ఎకరాలకు విస్తరించింది. అనంతకు తలమానికంగా మారింది. వేలాది మంది విద్యార్థులకు అధునాతన కోర్సులను బోధిస్తోంది. ఉపాధి కల్పనలో మేటిగా నిలుస్తోంది. బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద వేలమంది విద్యార్థులు, అత్యాధునిక వసతులు, భవనాలు.. ఇలా.. అన్నీ అద్భుతమే. అభివృద్ధి చెందిన దేశాల్లోని వర్సిటీలను తలదన్నేలా ఉంది.

ఆరు కోర్సులతో ప్రారంభం

రాష్ట్ర విభజనలో భాగంగా ఏపీకి రావాల్సిన సెంట్రల్ యూనివర్సిటీని అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సీయూఏపీ 2018లో సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం 1860కింద అనంతపురంలో స్థాపించిన సెంట్రల్ యూనివర్సిటీ 2019లో పార్లమెంట్ చట్టం ద్వారా అధికారికంగా గుర్తింపు పొందింది. తాత్కాలికంగా 2018 ఆగస్టు 5న జేఎన్టీయూలో ఆరు కోర్సులతో విద్యాబోధన ప్రారంభించారు. అనంతరం శాశ్వత వర్సిటీ నిర్మాణానికి బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద 491.03 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వ కేటాయించింది. అందుకు అవసరమైన ప్రహరీ, విద్యుత్, నీరు, రెండు లైన్ల రహదారి రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చింది. 2019లో ప్రభుత్వం మారడంతో వర్సిటీ అభివృద్ధి మందకొడిగా సాగింది. అవసరమైన అనుమతులు, నిధుల విషయంలోనూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుకావడంతో సెంట్రల్ వర్సిటీ అభివృద్ధి వేగం పుంజుకుని పనులు పూర్తిచేసేలా పర్యవేక్షించింది. దీంతో మంగళవారం నూతన సెంట్రల్ యూవర్సిటీగా ప్రారంభం కానుంది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా వర్సిటీని ప్రారంభించనున్నారు.

1600 మందికిపైగా విద్యార్థులు

2018 ఆగస్టు 5న నాలుగు డిగ్రీ, రెండు పీజీ కోర్సులతో సెంట్రల్ యూనివర్సిటీ ప్రారంభించారు. ప్రస్తుతం 47 కోర్సులతో 23 రాష్ట్రాలకు చెందిన 1600 మందికిపైగా విద్యార్థులు క్యాంపస్‌లో అభ్యసిస్తున్నారు. 9 డిగ్రీ, 17 పీజీ, 6 పీహెచ్‌డీ, 15 డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నారు. గత ఐదేళ్లలో వందలాది మంది విద్యార్థులు కోర్సులు పూర్తిచేసుకుని పట్టాలు పొందారు. వివిధ రంగాల్లో వారు ఉద్యోగాలు చేస్తున్నారని ప్లేస్‌మెంట్ అధికారులు తెలిపారు. క్యాంపస్‌లో పరిపాలనా భవనంతోపాటు మొత్తం 34 నూతన భవనాలను అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించారు.

నూతన క్యాంపస్

బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద 491.03 ఎకరాల్లో వర్సిటీ నూతన క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. భవన నిర్మాణాలు, వసతుల కల్పనకు రూ.711 కోట్లను కేటాయించారు. మొదటి దశ కింద రూ.350 కోట్లు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. ఇందులో ముఖ్యంగా 2200 మంది విద్యార్థులు వసతి పొందేలా ఆరు అంతస్థుల హాస్టల్ భవనాలు నిర్మించడం విశేషం. ఆహ్లాదకరమైన వాతావరణంలో, అత్యాధునిక భవనాలు, నూతన వసతుల మధ్య విద్యార్థులకు బోధిస్తున్నారు.

పరిశోధనలకు పునాది



పరిశోధన రంగంలో విద్యార్థులు ప్రవేశించేందుకు సెంట్రల్ యూనివర్సిటీ ఒక పునాది. బీఎస్సీ ప్రైవేటు కళాశాలలో పూర్తిచేశా. సైంటిస్ట్ కావాలన్న ఆకాంక్షతో ఉన్నత చదువులకు వెళ్లాలంటే ప్రైవేటు విద్యాసంస్థల్లో అధికంగా ఖర్చుచేయాల్సి ఉంటుంది. సెంట్రల్ యూనివర్సిటీ నోటిఫికేషన్‌తో ప్రవేశం పొంది పీజీ పూర్తి చేస్తున్నా.

- అంజుమ్, పీజీ ద్వితీయ సంవత్సరం, మాలిక్యులర్ బయాలజీ

అవకాశాల నిధి..



విద్యార్థులకు సెంట్రల్ యూనివర్సిటీ అవకాశాలు కల్పించే నిధి లాంటింది. ఫార్మా, ఫుడ్ సేఫ్టీ, ఇంజనీరింగ్, అగ్రికల్చర్ తదితర రంగాల్లో అవకాశాలు కల్పించేలా కోర్సులను ప్రవేశ పెట్టారు. ఇక్కడ విద్యను పూర్తి చేసుకుని డిగ్రీ పట్టా అందుకున్న విద్యార్థులు ఉన్నత భవిష్యత్తును అధిరోహిస్తారు.

-అశ్విని, పీజీ ద్వితీయ సంవత్సరం, మాలిక్యులర్ బయాలజీ

ప్రత్యేక కోర్సులు



వర్సిటీలో ప్రత్యేక కోర్సులు అందిస్తున్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో అలాంటి కోర్సులను విద్యార్థులకు అందిస్తున్నారు. దీంతో దక్షిణ భారత దేశంలోని విద్యార్థులు ఇక్కడకే వస్తున్నారు. ఉత్తర భారత దేశానికి చెందిన విద్యార్థులు కూడా చాలామంది చదువుతున్నారు. భవిష్యత్తుకు అనుగుణంగా డిగ్రీ, పీజీ కోర్సులు అందిస్తున్నారు.

-మారెన్, డిగ్రీ తృతీయ సంవత్సరం, ఎకనామిక్స్


అకడమిక్ బ్లాక్


తరగతుల నిర్వహణపై విద్యార్థులను ఆరాతీస్తున్న వీసీ ఎస్ఏ కోరి

చరిత్రలో నిలిచిపోయేలా..

వంద సంవత్సరాలపాటు విద్యనందించే వర్సిటీగా నిలిచిపోయేలా సెంట్రల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. వేలాది మంది విద్యార్థులు డిగ్రీ, పీజీ కోర్సులు అభ్యసిస్తున్నారు. చరిత్రలో నిలిచిపోయేలా విశ్వవిద్యాలయం ఏర్పాటైంది.

- ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ

సివిల్స్‌కు పట్టు



సివిల్స్‌లో ర్యాంకులు కొట్టేందుకు ఢిల్లీ వరకు ప్రత్యేక కోచింగ్ తీసుకునేందుకు విద్యార్థులు పరుగులు పెడుతున్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీ నుంచే సివిల్స్ పరీక్షపై పట్టు సాధించే స్థాయిలో బోధిస్తున్నారు. అనంతపురంలో ఇలాంటి వర్సిటీని ఏర్పాటుచేయడం వరమే.

-మెగావత్ లావణ్య, డిగ్రీ ద్వితీయ సంవత్సరం, పొలిటికల్ సైన్స్

విద్యార్థులకు ప్రాధాన్యం



వర్సిటీలో చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రధాన్యత ఇస్తున్నారు. మాలిక్యులర్ బయాలజీలో ఇదే వర్సిటీలో పీజీ పూర్తిచేశా. ఉద్యోగ ప్రకటనతో దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూకి వచ్చా. ఇక్కడి విద్యార్థులకు ప్రాధాన్యత ఇచ్చేలా అదనపు పాయింట్లతో అవకాశాలు కల్పించడంతో ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించా.

- అజ్మతుల్లా, ల్యాబ్ అసిస్టెంట్, మాలిక్యులర్ బయాలజీ

వడ్డీ వ్యాపారులను కఠినంగా శిక్షించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రాంభూపాల్, నాయకులు

ధర్మవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో చేనేత కార్మికుడు రమణ, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేసిన వడ్డీ వ్యాపారులను కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం నాయకులతో కలిసి సోమవారం సాయంత్రం ఆయన చేనేత కార్మికుడు రమణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమణ తాను తీసుకున్న అప్పు రూ.2లక్షలు, స్నేహితుడికి పూచి పడి ఇప్పించిన అప్పు రూ.4లక్షలు మొత్తం రూ.ఆరు లక్షలకు వారానికి రూ.60వేలు వడ్డీ చెల్లించినట్లు సీపీఎం నాయకులకు వెల్లడించారు. ఇప్పటి వరకు మొత్తం రూ.15.3లక్షలు చెల్లించానని, దానికి సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నట్లు వారికి వివరించారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ రూ.15లక్షలు వసూలు చేసుకుని కూడా చేనేత కార్మికుడు, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేయడం దారుణమన్నారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి వడ్డీవ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం, మంత్రి సత్యకుమార్ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఎంనాయకులు జంగాలపల్లి పెద్దన్న, జేవీరమణ, మారుతి, ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, హరి, ఎస్ఎఫ్ఐ నాయకుడు నాగార్జున ఉన్నారు.

రుయాలో గుండె పోటుతో వైద్యుడి మృతి


డాక్టర్ నరేంద్ర (ఫైల్)

తిరుపతి(వైద్యం), జూలై 28(ఆంధ్రజ్యోతి): వార్డులో రోగులను పరీక్షించిన వైద్యుడు.. బయటకు వస్తూనే కుప్పకూలారు. గుండె పోటుకు గురై మృతిచెందారు. ఈ విషాద ఘటన తిరుపతిలోని రుయాస్పత్రిలో సోమవారం చోటుచేసుకుంది. జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నరేంద్ర(55) సోమవారం మధ్యాహ్నం వరకు వార్డులో పలువురు రోగులను పరీక్షించారు. మరో వార్డులో రోగులను పరీక్షించేందుకు వెళుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆస్పత్రి ఆవరణలోనే కుప్పకూలారు. వెంటనే వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది ఆయన్ను పక్కనే ఉన్న అత్యవసర విభాగానికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం స్విమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. ఈయన స్వగ్రామం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం. ఇటీవలనే నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బదిలీపై రుయాస్పత్రికి వచ్చారు. ఆయన మృతికి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధతోపాటు పలువురు వైద్య విభాగాధిపతులు సంతాపం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో దంపతుల ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న దంపతులు

బొమ్మనహాళ్, జూలై28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో ఆర్యవైశ్య కాంప్లెక్స్‌లో ఒక జంట అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. స్థానికులు, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు కర్ణాటకలోని హొస్పేట్‌కు చెందిన హఫ్రీనా(20), రెహమాన్(25) దంపతులు నెల రోజులు కిందట ఆంజనేయస్వామి దేవాలయం, కాంప్లెక్స్‌లకు రంగు వేసేందుకు వచ్చారు. ఆర్యవైశ్య కాంప్లెక్స్‌లో ఒక గదిని అద్దెకు తీసుకుని పెయింట్ పనులు చేస్తున్నారు. దేవాలయం పెయింట్ పనులు ముగిసిన తర్వాత గ్రామంలో మరికొందరి పెయింట్ పనులు చేస్తున్నారు. ఏమి జరిగింతో కాని సోమవారం ఉదయం నుంచి బయటకు రాలేదు స్థానికులు కొందరు గది కిటికీలో నుంచి చూడగా దంపతులు ఉరికి వేలాడుతూ కనిపించారు. దీంతో బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టమోటాలు కిలో రూ.40

అనంతపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టమోటాలు రూ.40తో అమ్ముడుపోయాయి. అలాగే సరాసరిగా రూ.34, కనిష్ఠంగా రూ.20 పలికాయి. మార్కెట్‌కు మొత్తంగా 3,300టన్నుల టమోటాలు వచ్చినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

ఎస్కేయూను ఉన్నత స్థానంలో నిలుపుదాం

- వైస్ చాన్సలర్ ఆచార్య అనిత
- ఘనంగా వర్సిటీ ఫౌండేషన్ డే


జ్యోతి వెలిగిస్తున్న వీసీ

అనంతపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సమష్టిగా పనిచేసి యూనివర్సిటీని ఉన్నత స్థానంలో నిలుపుదామని ఎస్కేయూ వీసీ ఆచార్య అనిత పిలుపునిచ్చారు. వర్సిటీలోని భువన విజయ ఆడిటోరియంలో సోమవారం యూనివర్సిటీ ఫౌండేషన్ డేను ఘనంగా నిర్వహించారు. వర్సిటీ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వీసీ ఆచార్య అనిత, విశిష్ఠ అతిథిగా యూనివర్సిటీ మాజీ రెక్టార్ విశ్వేశ్వరరావు, యూనివర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంతో మంది కృషి వలన యూనివర్సిటీ ఉన్నత స్థానంలో ఉందన్నారు. రూసా నిధులతో పది సెమినార్ హాళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పీఎం ఉష కింద రూ.20కోట్ల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వాతావరణ శాస్త్ర అధ్యయనాలు, భౌతిక శాస్త్ర విభాగంలో ఇస్రో వారి సహకారంతో పరిశోధనలు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. విశిష్ఠ అతిథి విశ్వేశ్వర రావు మాట్లాడుతూ వీసీ అనిత యూనివర్సిటీ అభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. విద్యార్థులు వర్సిటీలోని వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఫౌండేషన్ డేను పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బోధన, బోధనేతరసిబ్బంది, విశ్రాంత అధ్యాపకులు, వర్సిటీలోని వివిధ కళాశాల ప్రిన్సిపాళ్లు, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డు ప్రవాహం

- హంద్రీనీవాలో 2వేలకుపైగా క్యూసెక్కులు
- కాలువ చరిత్రలో అత్యధికంగా నీరు సరఫరా
- రాగులపాడు వద్ద 8 పంపుల ద్వారా ఎత్తిపోతలు
- అన్నదాతల హర్షం


రాగులపాడు లిఫ్ట్ వద్ద ఎనిమిది పంపుల నుంచి దూకుతున్న నీరు

ఉరవకొండ/బెళుగుప్ప, జూలై 28(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ చరిత్రలోనే అత్యధికంగా నీరు పారిస్తున్నారు. వజ్రకరూరు మండలం రాగులపాడు వద్దనున్న లిఫ్ట్ వద్ద సోమవారం ఏకంగా ఎనిమిది పంపుల ద్వారా నీటిని ఎత్తి పోస్తున్నారు. కాలువ చరిత్రలో ఇప్పటివరకు 6 పంపులతోనే తోడేవారు. ఏకంగా 8 పంపులతో ఎత్తిపోయడం ఇదే ప్రథమం. గతంలో అత్యధికంగా 1,700 క్యూసెక్కులు మాత్రమే కాలువలో పారింది. ప్రస్తుతం 2 వేలకుపైగా క్యూసెక్కులు పారిస్తున్నారు. మొత్తం 12 పంపులతో 3,600 క్యూసెక్కుల నీటిని కాలువలో ప్రవహింప జేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుతం జీడిపల్లి జలాశయానికి 1,382 క్యూసెక్కుల నీరు చేరుతోంది. జీడిపల్లి రిజర్వాయర్ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 1.68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.398 టీఎంసీల నీరు ఉంది. మరో మూడు రోజుల్లో జలాశయం నిండనుంది. ఆ తరువాత నీటిని పీఏబీఆర్‌కు వదిలేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని చాయాపురం, రాగులపాడు, జరుట్ల రాంపురం, చిన్నముష్టూరు తూములకు 100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 34వ ప్యాకేజీలో డీ1, డీ2 డిస్ట్రిబ్యూటరీలకు 60 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు హెచ్ఎన్ఎస్ఎస్ డీఈ శ్రీనివాస్ నాయక్ తెలిపారు.

పీఏబీఆర్‌ను నింపండి: మంత్రి కేశవ్

జీడిపల్లి రిజర్వాయర్ నిండిన వెంటనే పీఏబీఆర్‌కు వదలాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.. ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. హంద్రీనీవా కాలువకు ఎనిమిది పంపులతో నీటిని విడుదల చేస్తున్నామన్నారు. పీఏబీఆర్ నిండేలోపు ఫేజ్-2 పనులను పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

ఆ శివయ్య వేరయా..!


- పెద్దాస్పత్రిలో ప్రైవేటు 'శివయ్య' వసూళ్లు
- అదే పేరున్న ఉద్యోగికి తంటాలు


సాకే శివయ్య

అనంతపురం వైద్యం, జూలై 28(ఆంధ్రజ్యోతి): సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులను మభ్యపెడుతూ ఒక వ్యక్తి వసూళ్ల పర్వం సాగించాడు. సదరం సర్టిఫికెట్ల మంజూరు, వెరిఫికేషన్, ఆరోగ్యశ్రీ, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ తదితర రూపాల్లో డబ్బు వసూలు చేయసాగాడు. ఆసుపత్రిలోని సిబ్బంది పేర్లుచెప్పి పనులు చేయిస్తానని బాధితులకు నమ్మబలికాడు. వారి నుంచి నగదుతోపాటు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బు వేయించుకున్నాడు. వార్డులోని పేషెంట్లతోనూ వసూళ్లకు పాల్పడ్డాడు. ఇలా దందాలు సాగిస్తున్నాడని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం దుబ్బర్లపల్లికి చెందిన సాకే శివయ్యగా గుర్తించి కేసు నమోదుచేసి, అరెస్టు చేశారు. ఆసుపత్రిలోని కంటి విభాగంలో దంపెట్ల శివయ్య అనే ఉద్యోగి పనిచేస్తున్నారు. వసూలు చేస్తున్నది దంపెట్ల శివయ్య అని ఆసుపత్రిలో చర్చ మొదలైంది. దీంతో వసూళ్ల శివయ్య తానుకాదనీ, దుబ్బర్లపల్లికి చెందిన సాకే శివయ్యగా గుర్తించి కేసు నమోదు చేసి అరెస్టు చేశారని అధికారులకు దంపెట్ల శివయ్య లేఖ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

'తరిమెల' ఆశయాలను కొనసాగిద్దాం

- సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు జాస్తి కిషోర్‌బాబు


మాట్లాడుతున్న జాస్తి కిషోర్‌బాబు

అనంతపురం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పోరాట యోధుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు జాస్తి కిషోర్‌బాబు పేర్కొన్నారు. తరిమెల నాగిరెడ్డి 49వ వర్థంతిని సోమవారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాస్తి కిషోర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తరిమెల నాగిరెడ్డి విద్యార్థిగా ఉన్నపుడే జాతీయ ఉద్యమానికి ప్రభావితుడై బెనారస్ విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా ఎన్నికయ్యారన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు సిద్ధాంతాల మధ్య ఉన్న తేడాలను గుర్తించిన ఆయన ప్రజలకు నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని, మెరుగైన జీవితాన్ని సాధించిపెట్టగలిగేది కమ్యూనిస్టు సిద్ధాంతమేనని నిర్ధారణకు వచ్చి, తన తుది శ్వాస వరకూ కమ్యూనిస్టుగా కొనసాగారన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచిన ఆయన చట్టసభల్లో పీడిత ప్రజలపక్షాన శక్తివంతంగా తన గళాన్ని వినిపించారని కొనియాడారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు సూర్యసాగర్, మానవతా సంస్థ అధ్యక్షుడు తరిమెల అమర్నాథ రెడ్డి, ఎస్ఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు నేడే ఆఖరు

కొత్తచెరువు, జూలై 28(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 29తో గడువు ముగుస్తుందని జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు లాజర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పరీక్ష పూర్తిగా ఎన్‌వీఎస్(నవోదయ విద్యాలయ సమితి) కింద సీబీఎస్ఈలో ఉంటుందని ఆయన తెలిపారు. ఆసక్తిగల ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెచ్‌టీటీపీ/సీబీఎస్ఈఐటీఎంఎస్.ఆర్‌సీఐయల్.జీఓవీ.ఇన్/ఎన్‌వీఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

అత్తారింటి వేధింపులపై కేసు

ధర్మవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): భర్త, అత్త తరచూ వేధిస్తున్నారని వడితే లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు...ధర్మవరం లోని చంద్రబాబునగర్‌కు చెందిన రామ్మూర్తినాయక్ ఎలక్ట్రిషియన్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడి భార్య వడితే లక్ష్మీదేవి గృహిణి. వివాహం అయినప్పటి నుంచి రామ్మూర్తినాయక్ తల్లి పార్వతిబాయి మాటలు విని లక్ష్మీదేవిని శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. మద్యానికి బానిసై, వివాహేతర సంబంధాలు నడుపుతూ, విడాకుల కోసం భార్యను వేధించేవాడు. పెద్దమనుషులు పంచాయితీ చేసినా మార్పు రాకపోవడంతో లక్ష్మీదేవి తన పుట్టినిల్లు అయిన నేలకోట గ్రామానికి ఇద్దరు పిల్లలతో కలిసి వచ్చి ఉంటోంది. అయినా ఫోన్‌లో ఆమెకు వేధింపులు ఆగలేదు. వీటిని భరించలేక సోమవారం ఆమె భర్త, అత్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

అనంతపురం న్యూటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ మిట్ట సమీపాన పట్టాలు దాటుతున్న మహిళను సోమవారం సాయంత్రం వందేభారత్ రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. రైల్వే ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 30 ఏళ్ల వయసున్న మహిళ రైలు పట్టాలు దాటుతుండగా.. బెంగళూరు నుంచి వచ్చిన వందేభారత్ రైలు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అపస్మారక స్థితిలో ఉండటంతో వివరాలు తెలియలేదని ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9441445354 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

ఘరానా దొంగ పరార్..?

- సీసీఎస్ పోలీసుల అదుపులో నుంచి ఎస్కేప్
- ఐదు రోజుల క్రితమే తప్పించుకున్న వైనం?
- నిందితుడిపై 30 వరకూ కేసులు

అనంతపురం క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): అనంత సీసీఎస్ పోలీసుల అదుపులో ఉన్న ఘరానా దొంగ తప్పించుకున్నట్లు తెలుస్తోంది. తర్వాత దొంగను పట్టుకునేందుకు పోలీసులు పరుగులు తీసినట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. 5 రోజుల క్రితమే దొంగ తప్పించుకున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. కంబదూరు మండలంలోని వెంకటంపల్లి తండాకి చెందిన ఓ నిందితుడిని ఇటీవల సీసీఎస్ పోలీసులు తీసుకొచ్చినట్లు సమాచారం. చైన్ స్నాచింగ్స్‌లో పేరుమోసిన నిందితుడిపై 30 వరకూ కేసులున్నట్లు తెలుస్తోంది. అతడిని విచారిస్తుండగా పరారైనట్లు తెలిసింది. తేరుకున్న పోలీసులు మళ్లీ దొంగ వేటలో పడినట్లు సమాచారం. అప్పటికే సదరు దొంగ సొంతూరికి వెళ్లినట్లు తెలిసింది. పోలీసులు అక్కడికి వెళ్లి దొంగను మళ్లీ తీసుకొచ్చి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. సంబంధిత పోలీసు అధికారులు ఘరానా దొంగ పరారీపై నోరు మెదపడం లేదు. 'ఏం జరగలేదు... అంతా తూచ్' అంటూ పెదవి విరుస్తున్నారు. దొంగ పరారీ ఘటన బయటకు ఎలా వచ్చిందంటూ పోలీసులు హైరానా పడుతూ కనిపించడం చూస్తుంటే... ఎస్కేప్ నిజమేనని తెలుస్తోంది. మరి ఈ నిర్లక్ష్యంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఏం చేస్తారో చూడాలి.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.11వేలు పలికాయన్నారు.


భక్తులకు తిరువీధుల్లో దర్శనమిస్తున్న శ్రీవారు

ఘనంగా గోదాదేవి జయంతి

కదిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆండాల్ తిరునక్షత్రం సందర్భంగా లక్ష్మీనరసింహస్వామితోపాటు, శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

టీపీ కైలాసం (జయంతి)



తంజావూరు పరమశివ అయ్యర్ (టీపీ) కైలాసం 1884 జూలై 29న మైసూరులో జన్మించారు. రచయిత, సాహితీవేత్త. హాస్యంతో కూడిన ఎన్నో నాటకాలు రాశారు. సమాజంలోని సమస్యలపై ఆయన నాటకాలలో ప్రస్తావించేవారు. ఆంగ్లం నుంచి కన్నడలోకి అనువాదం చేశారు. 'కర్ణాటక ప్రహసన పితామహ, కన్నడక్కె ఒబ్బనె కైలాసం' బిరుదులు పొందారు. తర్ఫీదు పొందిన జియాలజిస్ట్, క్రీడాకారుడు, నటుడిగాను రాణించారు. 1945లో మద్రాస్‌లో జరిగిన కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించారు. 1946 నవంబరు 23న కన్నుమూశారు.

సినారె (జయంతి)



సినారెగా పేరొందిన సింగిరెడ్డి నారాయణ రెడ్డి 1931 జూలై 29న కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా) హనుమాజీ పేటలో జన్మించారు. తెలుగు కవి, సాహితీవేత్త. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన ఎనలేని సేవలకుగాను 1988లో 'విశ్వంభర' కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారం లభించింది. పద్య కావ్యాలు, గేయాలు, వచన కవితలు, గద్య కృతులు, సినిమా పాటలు, యాత్రా కథనాలు, సంగీత నృత్య రూపకాలు, బుర్రకథలు, గజళ్ళు తదితర రచనలు చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ, పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్‌లు పొందారు. 2017 జూన్ 12న కన్నుమూశారు.

బిడారం కృష్ణప్ప (వర్ధంతి)



బిడారం కృష్ణప్ప 1866 సెప్టెంబరు 1న జన్మించారు. కొంకణి మాట్లాడే కుటుంబంలో ఉడుపి జిల్లా నందలికె గ్రామంలో జన్మించారు. 19వ యేట మైసూరు మహారాజ ప్యాలెస్‌లో కర్ణాటక సంగీతకారుడిగా గుర్తింపు పొందారు. ఆయన ప్రతిభకు తాళ బ్రహ్మగాను, గాన విశారద, శుద్ధ శివాచార్య, పల్లవి కృష్ణప్ప తదితర బిరుదులు పొందారు. ప్రత్యేకించి కన్నడలో దేవరనామాలు పాడడంలో పేరొందారు. 1931 జూలై 29న కన్నుమూశారు.

వెంపటి చినసత్యం (వర్ధంతి)



భరతనాట్యానికి సమానంగా 'కూచిపూడి' ఖ్యాతిని చాటిన వెంపటి చినసత్యం 1929 అక్టోబరు 15న కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో జన్మించారు. భరతనాట్యమే విరాజిల్లుతున్న తరుణంలో కూచిపూడి నృత్య సంప్రదాయాన్ని చెన్నై కళాభిమానులకు పరిచయం చేసి దీటైన స్థానాన్ని సంపాదించి పెట్టారు. నృత్య నాటికలను ఎన్నో రూపొందించి విదేశాలలో ప్రదర్శించి వాటికి విశేష ఆదరణ కల్పించారు. చెన్నైలో కూచిపూడి ఆర్ట్ అకాడమీని స్థాపించి ఎంతోమందికి తర్ఫీదు ఇచ్చారు. 1984లో అమెరికా పిట్స్‌బర్గ్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆస్థాన నాట్యాచార్యుడిగా పనిచేశారు. 2011లో హైదరాబాద్‌లో 2,800 మంది కళాకారులతో ఏకకాలంలో నిర్వహించిన అంతర్జాతీయ కూచిపూడి కార్యక్రమానికి గిన్నిస్ రికార్డు గా నిలిచింది. 2012 జూలై 29న కన్నుమూశారు.

జయప్రభ (పుట్టినరోజు)



ప్రముఖ స్త్రీవాద రచయిత్రిగా పేరొందిన జయప్రభ 1957 జూలై 29న మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జన్మించారు. విద్యాభ్యాసం విశాఖపట్నంలో గడిచింది. తెలుగు సాహిత్యంలో ఎంఏ చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు నాటకంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందారు. లోహిత అనే పత్రికకు కొండవీటి సత్యవతితో కలసి సంపాదకత్వం వహించారు. ఆమె కవిత్వాన్ని మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు 'అన్‌ఫర్‌సేన్ అఫెక్షన్ అండ్ అదర్ పోయెమ్స్' పేరుతో ఆంగ్లంలోకి అనువాదం చేశారు. ఆమె రచనలు జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో ప్రచురితమయ్యాయి.

సౌలభ్యాలు సద్వినియోగం చేసుకోండి



బ్యాగులతో విద్యార్థులు తదితరులు

ముళబాగిలు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయువల్ల గుణాత్మక విద్య, మధ్యాహ్నం భోజనం, క్షీరభాగ్య, ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, షూ, సాక్స్ వంటి ప్రభుత్వ సౌలభ్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అఖిల కర్ణాటక హెళవ పిచ్చగుంట్ల సంఘం అధ్యక్షుడు వీ కృష్ణప్ప అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దేవరాయసముద్ర గ్రామపంచాయతీ పరిధిలోని జమ్మనహళ్ళి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఇతర రాత సమాగ్రి పంపిణీ చేసి మాట్లాడారు. ఆంగ్లభాష వ్యామోహాన్ని తల్లిదండ్రులు వీడాలన్నారు. కన్నడ పాఠశాలల్లో చదివినవారు ఉన్నత హోదాలలో దేశవిదేశాలలో ఉన్నారన్నారు. తల్లిదండ్రులను గురువులను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. తమ తాత ఇదే గ్రామంలో పుట్టి పెరిగారని, ఆయన జ్ఞాపకార్థం పేద విద్యార్థులకు తన చేతనైన సాయం చేయదలిచినట్టు తెలిపారు. సమాజసేవకుడు వెంకటాచలపతి, దేవరాయ సముద్ర గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు జమ్మనహళ్ళి కృష్ణ, శాంతమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రచ్చబండకు మంత్రి రాక

రొద్దం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం కల్లుకుంట గ్రామంలో మంగళవారం నిర్వహించనున్న రచ్చబండకు మంత్రి సవిత హాజరుకానున్నట్లు మండల కన్వీనర్ నరహరి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు కార్యక్రమ నిర్వహణ ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, తరలిరావాలని కోరారు.

పోలీసు భద్రత నడుమ భూముల పరిశీలన

» గ్రామాల్లో కేఐఏడీబీ స్పెషల్ ఆఫీసర్ హరిశిల్ప



రైతులతో అధికారుల చర్చలు

శిడ్లఘట్ట, జూలై 28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జంగమకోటె హోబళి 13 గ్రామాలలో 2,823 ఎకరాలను పరిశ్రమల ఉద్దేశ్యంగా స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో రైతుల వ్యతిరేకత నడుమ కూడా కేఐఏడీబీ స్పెషల్ ఆఫీసర్ హరిశిల్పా సోమవారం పరిశీలన చేశారు. హోబళిలోని దేవగానహళ్ళి, గొల్లహళ్ళి, కులుమె హోసూరు, బసవాపట్టణ, నడిపినాయకనహళ్ళి, యణ్ణంగూరు, అరికెరె, సంజీవపుర, హోసపేటె, ఎద్దల తిప్పనహళ్ళి గ్రామాలలో పోలీసుల భద్రత నడుమ భూములను పరిశీలించారు. బసవాపట్టణలో పరిశీలన వేళ రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. భూములు ఇచ్చేవారి ప్రాంతాలను పరిశీలించాలని, రైతుల అనుమతి లేకుండా పరిశీలన సరికాదని బదులిచ్చారు. దీంతో హరిశిల్పా మాట్లాడుతూ తాము భూస్వాధీనం చేసుకోవడానికి రాలేదని, కొంతమంది రైతులు కోర్టులో కేసేశారని అందుకే పరిశీలించడానికి తాము వచ్చామన్నారు. ఏం పంటలు పండిస్తున్నారో స్వయంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తానన్నారు. భూములు ఇచ్చేందుకు రైతుల అంగీకారం లేకుంటే స్వాధీనం ఉండదన్నారు. అయితే ప్రభుత్వ సూచన మేరకు రైతులతో చర్చలు ఉంటాయన్నారు. ఒకదశలో రైతులు ఆవేశం చెందడంతో నియంత్రించేందుకు పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. పోలీసులు సంయమనంతో వ్యవహరించడం వల్ల ఎలాంటి గొడవలు జరగలేదు.

ముస్తాబవుతున్న వరమహాలక్ష్మి



బెంగళూరు, జూలై28(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం వచ్చేసింది... వరుస పండుగలు వచ్చేస్తున్నాయి. మరో పదిరోజులలో వరమహాలక్ష్మి వ్రతం జరగనుంది. వచ్చే శుక్రవారం వరమహాలక్ష్మికి వ్రతంతోపాటు ప్రత్యేక పూజలు చేసే సంప్రదాయం ఉంది. మార్కెట్‌లో వరలక్ష్మీ విగ్రహాలు కొలువుదీరాయి. వరమహాలక్ష్మి పూజతోపాటు కళశం రూపంలో అలంకరించే సంప్రదాయం ఉంది. మార్కెట్‌లో వరమహాలక్ష్మి విగ్రహాలకు కళాకారులు రంగులు దిద్దుతున్నారు.

విగ్రహాలకు తుదిరూపు ఇస్తూ...

హెపటైటిస్ పట్ల జాగ్రత్తలు పాటించాలి

» మంత్రి దినేశ్ గుండూరావు



వాకథాన్‌లో మాజీ మంత్రి గోపాలయ్య తదితరులు

బెంగళూరు,జూలై28(ఆంధ్రజ్యోతి): హెపటైటిస్ పట్ల జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు అభిప్రాయపడ్డారు. లయన్స్ క్లబ్, కర్ణాటక గ్యాస్ట్రో సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో హెపటైటిస్‌పై అవగాహన కల్పించేలా వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా దినేశ్ గుండూరావు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్యసంస్థ ఈ ఏడాది హెపటైటిస్ పట్ల లెట్స్ బ్రేక్ ఇట్ డౌన్ అనే నినాదంతో అవగాహన కల్పిస్తోందన్నారు. కాలేయ సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. వాకథాన్‌లో మాజీ మంత్రులు గోపాలయ్య, అశ్వత్థనారాయణ, లయన్స్ సంస్థ జిల్లా గవర్నర్ జీ మోహన్, ఈశ్వరన్, శశిధర్ గంజికట్టి తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం 7 నుంచి 8 వరకు వాకథాన్ జరిపారు. వాకథాన్ ఉత్సాహంగా సాగింది. ఆ తర్వాత ఉచిత వైద్య పరీక్షా శిబిరం నిర్వహించారు. రాజాజినగర్ ప్రాం తవాసులతో పాటు నార్త్‌వెస్ట్ ఆసుపత్రి, ఫోర్టిస్ ఆసుపత్రి, సర్వోదయ నర్సింగ్ కాలేజ్, శేషాద్రి పురం ఈవెనింగ్ కాలేజ్, గౌతమ్ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు.

చిత్రావతి డ్యాంకు శ్రీరామరెడ్డి పేరు పెట్టాలని డిమాండ్



పురసభ అధికారులకు విన్నవిస్తున్న దృశ్యం

బాగేపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పరగోడు గ్రామ పంచాయతీలోని చిత్రావతి డ్యాంకు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీరామరెడ్డి పేరు పెట్టాలని రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. చిత్రావతి డ్యాంకు మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ పేరు పెట్టాలన్న పురసభ ప్రకటనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతు సంఘాలు, సీపీఎం ఆధ్వర్యంలో కార్యకర్తలు సోమవారం పురసభ ముఖ్యాధికారిని కలసి వినతిపత్రం సమర్పించారు. తమ అభ్యంతరాలు వివరించారు. పురసభ ముఖ్య అధికారి బదులిస్తూ జిల్లా ఇన్‌చార్జ్ ఆదేశాల మేరకు ఆదేశాలు జారీ చేశామని వివరిస్తూ అభ్యంతరాలు ఉంటే వ్యక్తం చేయాలన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మండలి సభ్యుడు మునివెంకటప్ప మీడియాతో మాట్లాడుతూ శ్రీరామరెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారని అప్పట్లో సీఎం జేహెచ్ పటేల్ ఉండేవారని శాసనసభ సమావేశాలలో చిత్రావతి డ్యాం గురించి ప్రస్తావించారన్నారు. అనంతరం ఎన్నికల్లో ఓడిపోవడంతో 66రోజులపాటు బయలాంజనేయసర్కిల్‌లో రాత్రింబవళ్లు ప్రతిఘటన చేసి ప్రభుత్వదృష్టికి తెచ్చారన్నారు. ఇంతటి మహనీయుడిని కాదని ఈ అంశంతో సంబంధంలేని వ్యక్తి పేరు పెట్టడం సమంజసం కాదన్నారు. సీపీఎం నాయకుడు చన్నరాయప్ప మాట్లాడుతూ 1994లో పరగోడు సమీపాన చిత్రావతి డ్యాంకు జీవీ శ్రీరామరెడ్డి యాక్షన్‌ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి సమర్పించగా అనుమతులు మంజూరు చేసిందన్నారు. 1999-2000 బడ్జెట్‌లో రూ.4.60కోట్లతో డ్యాంకు తొలివిడతలో రూ.2కోట్లు విడుదల చేశారన్నారు. ఆ తర్వాత పలు రాజకీయ సంఘర్షణలు నెలకొన్నా డ్యాంను శ్రీరామరెడ్డి పూర్తి చేశారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎస్ఎం కృష్ణ పేరు పెట్టేందుకు అంగీకరించేది లేదన్నారు. ఈ సందర్భంగా కర్ణాటక ప్రాంత రైతుసంఘం తాలూకా సంచాలకులు డీటీ మునిస్వామి, పురసబ మాజీ సభ్యుడు రామకృష్ణప్ప, చిత్రావతి డ్యాం పోరాట ప్రముఖులు లక్ష్మీనారాయణరెడ్డి, టైలర్ మూర్తి, మధూరసూదనరెడ్డి, వాల్మీకినగరకు చెందిన అశ్వత్థప్ప, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులకు వ్యతిరేకంగా నిరసన



ఫ్రీడంపార్కులో ప్లకార్డులతో నిరసన

బెంగళూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ప్రభుత్వ ఆర్‌సీ కళాశాలను బెంగళూరు నగర విశ్వవిద్యాలయ విభాగాల కాలేజీలుగా మార్పు చేయడంపై కర్ణాటక కదంబ పడె ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాలలోని క్రీడా మైదానాన్ని ప్రైవేట్ క్రికెట్ క్లబ్‌తో ప్రిన్సిపాల్ డాక్టర్ పీటీ శ్రీనివాసనాయక్ ఒప్పందం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. కొంతమంది అధ్యాపకులు యూజీసీ వేతనాలు పొందుతున్నా కళాశాలల్లో తరగతులు నిర్వహించకుండా సొంతపనుల్లో ఉంటున్నారని ఆరోపించారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు నిరసనలో పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కొనేలా నైపుణ్యం పెంపొందించుకోండి

● విద్యార్థులకు ఆర్‌యూ వీసీ జయరాం పిలుపు

బెంగళూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా నైపుణ్యం సాధించాలని గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్, రామయ్య అప్లైడ్ సైన్స్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎంఆర్ జయరాం పిలుపునిచ్చారు. ఆర్‌వీ విశ్వ విద్యాలయంలో నవోదయ 2025 కొత్తబ్యాచ్‌లను సాదరంగా స్వాగతించారు. సోమవారం ఆర్‌వీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్, లా, కామర్స్‌తోపాటు వివిధ విభాగాలకు చెందిన విద్యాసంస్థల ప్రారంభంలో 2వేలమంది విద్యార్థులను స్వాగతించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఆర్ జయరాం మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకుంటేనే ఉన్న తస్థాయికి విద్యార్థులు చేరగలుగుతారన్నారు. చాణక్య యూనివర్సిటీ వ్యవ స్థాపక చాన్స్‌లర్ ఎంకే శ్రీధర్ మాట్లాడుతూ కొత్త అంశాలు సకారాత్మక మా ర్పులకు కారణమవుతున్నాయని, విద్యార్థులు కూడా విభిన్నమైన కార్యా చరణతో ఆలోచించాలన్నారు. ఆర్‌వీ యూనివర్సిటీ కులపతి ఏవీఎస్ మూర్తి, ట్రస్టు చైర్మన్ ఎంపీ శ్యామ్, రిజిస్ట్రార్‌లు సహనా డీ గౌడ పాల్గొన్నారు. ఉదయం, మధ్యాహ్నం విద్యార్థులకు అవగాహనా తరగతులు నిర్వహించారు. కాగా నంజనగూడులో కొత్త క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ జయరాం

తల్లిదండ్రులకు సహకారం అందించాలి

● విద్యార్థులకు జీవీ కృష్ణ సూచన



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు తదితరులు

బంగారపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నేర్చు కోవడంతో పాటు తల్లిదండ్రుల పనులలో సహకారం అందించాలని ఇందిరా విద్యాసంస్థ కార్యదర్శి జీవీ కృష్ణ అభిప్రాయ పడ్డారు. బూదికోటె గ్రామంలోని విద్యాసంస్థలో మంట లేకుండా వంట చేయడం అనే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక వికాసానికి విద్యార్థు లకు పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నామని అందులో ఇదొకటన్నారు. పండుగలు, పర్వదినాల వేళ సంప్రదాయాల ఆచరణ కోసం అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. పోటీలలో 142మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీఐసీ చైర్మన్‌గా ప్రశాంత్ గోఖలే



బెంగళూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఛాంబర్స్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్ (బీసీఐసీ) 2025-26వ ఏడాదికిగాను ప్రశాంత్‌గోఖలే నియమింపబడ్డారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు నూతన అధ్యక్షుడి పేరును ఖరారు చేశారు. బుహ్లర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనే జింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న 49 ఏళ్ళ ప్రశాంత్‌కు బీసీఐసీలో ఉన్నత హోదా దక్కింది. వీఆర్ఇబిజ్ సొల్యూషన్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కే. రవి ఉపాధ్యక్షుడిగా నియమింపబడ్డారు ఫండర్‌మార్క్స్ ఇండియా ఎండీ డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి రెండో ఉపాధ్యక్షుడిగా నియమింపబడ్డారు. బీసీఐసీకు ఇప్పటిదాకా అధ్యక్షుడిగా కొనసాగిన వినీత్‌వర్మ కొత్త నాయకత్వానికి సంపూ ర్ణంగా సహకరిస్తానని ప్రకటించారు. బజాజ్‌ఆటో లిమిటెడ్ ఆర్ అండ్ డీ విభాగంలో వృత్తి జీవనానికి శ్రీకారం చుట్టిన ప్రశాంత్‌గోఖలే ఆ తర్వాత బుహ్లర్ సంస్థలో చేరారు. కాగా సీకే రవి చార్టెర్డ్ అకౌంటెంట్‌గా దేశ విదేశీ పన్నుల విధానం, పెట్టుబడులకు సంబంధించిన అనుభవంతో పాటు కార్పొరేట్ ఆడిట్‌లోను అనుభవం కలిగి ఉన్నారు. ఇదే సందర్భంగా ప్రశాంత్ గోఖలే మాట్లాడుతూ రాష్ట్ర పారిశ్రామిక రంగం అభివృద్ధికి కారణమైన బీసీఐసీలో కీలక పదవి దక్కినందుకు సంతోషంగా ఉందని పైగా నావంతు బెంగళూరులో పరిశ్రమల అభివృద్ధితో పాటు పారిశ్రామిక వేత్తల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎంఎస్ఎంఈల సబలీకరణ, మౌళిక సదుపాయాలు, ఆధునీకరణ, వేగవంతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. సమిష్టిగా పరిశ్రమల అభివృద్ధికి అందరి సహకారంతో పనిచేస్తానన్నారు.

రోడ్లపై చెత్త, మట్టికుప్పలు

» బెంగళూరు నగర నిర్వహణపై బయోకాన్ ఎండీ ఆగ్రహం

బెంగళూరు, జూలై28(ఆంధ్రజ్యోతి): రోడ్లపై చెత్తా చెదారం ఎక్కడ చూసినా మట్టికుప్పలతో అధ్వానంగా మారిందని బెంగళూరు నిర్వహణ, మౌళిక సదుపాయాలపై బయోకాన్ సంస్థ చైర్మన్ కిరణ్ మజుందార్‌షా మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరు మరో గుర్‌గావ్‌గా మారిందని మండిపడ్డారు. 'ఎక్స్' ద్వారా మౌళిక సదుపాయాలు లేకపోవడంపై ఆమె బీబీఎంపీకి వ్యతిరేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గుర్‌గావ్‌లో వరద ప్రవాహం, చెత్తకు సంబంధించి రచయిత, స్టాటిస్టిక్స్ నిపుణులు సుహేల్‌సేథ్ చేసిన పోస్టింగ్‌పై కిరణ్ మజుందార్‌షా స్పందించారు. ఇది ప్రతి శ్రీమంతనగరానికి వచ్చిన సమస్య అని, బెంగళూరు మరో గుర్‌గావ్‌గా మారిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. మౌళిక సదుపాయాలు, ప్రజలకు అవసరాలు సమకూర్చే విషయంలో బాధ్యతలేని రాష్ట్రం బంగారు గుడ్డు పెట్టే కోడిని లూటీ చేసి హతమారుస్తున్నారన్నారు. డబ్బుకోసం భవనాల నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నారు. అంతకుముందు శుక్రవారం కూడా ఆమె బెంగళూరు నగర సమస్యలపై మండిపడిన విషయం తెలిసిందే. చెత్త, మట్టికుప్పల ఫోటోలను షేర్ చేసి వీటిని బీబీఎంపీ ఎందుకు తొలగించదని ప్రశ్నించారు. స్మశానం పక్కన ఉండే బర్లి స్ట్రీట్ వద్ద చెత్తకు సంబంధించిన ఫోటోలను ఆమె షేర్ చేశారు. నగరం రాష్ట్రరాజధానికి అనుబంధంగా ఉన్నా సరైన పాలన లేదని, ఏటా ప్రభుత్వసాయం లేకుండా ప్రజలు ఆనందించేలా వెనీస్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని అభిప్రాయపడ్డారు.

అలరించిన అన్నమయ్య పదార్చన



వేదికపై సంగీత విద్యార్థుల బృందం


బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి సంగీతాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమయ్య పదార్చన అలరించింది. వాగ్దేవి సంగీతాలయం ముఖ్యులు నీలిమా నాగవేణి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో సంగీతం, నృత్యం తరతరాలుగా వస్తోందన్నారు. భావితరాలకు సంగీతం, ఆధ్యాత్మికం నేర్పించాలనే లక్ష్యంతో సంస్థను కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యులుగా దయానంద్ యూనివర్సిటీ వక్త అండ్ గాయని డాక్టర్ ఆరతి, ఆలిండియా రేడియో కళాకారిణి, గాయని లక్ష్మీశరత్‌తోపాటు సుష్మాశ్రీధర్‌లు పాల్గొన్నారు. వాగ్దేవి సంస్థలో శిక్షణ పొందినవారు అన్నమయ్య కీర్తనలు అన్నమయ్య గేయాలను ఆలపించారు. మల్లేశ్వరం లోని శుక్ర ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పెద్దఎత్తున సంగీ తాభిమానులు పాల్గొన్నారు.

హాకథాన్.. విద్యార్థుల మేధస్సును పెంచుతుంది



విజేతలకు ప్రశంసాపత్రాల అందజేత

బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌లో అకడమిక్‌తోపాటు మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా జరిపే హాకథాన్ విద్యార్థులలో మేధస్సును పెంచుతుందని ఐబీఎం సంస్థ సీనియర్ పార్ట్‌నర్ అండ్ సర్వీస్‌లైన్ లీడర్ సంతోష్‌ప్రసాద్ అభిప్రాయపడ్డారు. నగరంలోని బీఎన్ఎంఐటీలో రెండు రోజులపాటు హాకథాన్ పోటీలు జరిగాయి. క్లైమేట్ చేంజ్ అనాలసిస్ అండ్ మిటిగేషన్, మెంటల్ హెల్త్ టెక్నాలజీ సపోర్ట్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ అనే అంశాలపై పోటీలు సాగాయి. రెండు విడతలుగా సాగిన పోటీలలో 291 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌కు 50 జట్లు ఎంపికయ్యాయి. ఐబీఎంకు చెందిన ప్రముఖులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మూడు విభాగాలలో తలా ముగ్గురిని ఎంపిక చేశారు. బీఎన్ఎంఐటీ చైర్మన్ నారాయణరావ్ తదితరులు పాల్గొన్నారు. విజేతల బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.54	1,631.09
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	96,836	1,24,361
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1.06,548	1.50.798
నీటి నిల్వ (టీఎంసీలు)	75.00	98.22

ఎంవీఏ కోర్సులకు ఆన్‌లైన్
దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట, జూలై28(ఆంధ్రజ్యోతి): చామరాజేంద్ర ప్రభుత్వ విజువల్ ఆర్ట్స్ కళశాల మైసూర్ 2025-26 విద్యాసంవత్సరానికి మొదటి బ్యాచిలర్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ బీవీఏ డిగ్రీలో ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి మాస్టర్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్(ఎంవీఏ)మొదటి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలో ప్రవేశానికి ఆల్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల డీన్ సోమవారం ఒక ప్రకటనలో తలిపారు. ఎంవీఏ పెయింటింగ్, స్కల్ప్చర్ రంగంలో రెండు సంవత్సరాలు, నాలుగు సెమిస్టర్ల సీబీసీఎస్ ఆధారిత పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పెయింటింగ్, స్కల్ప్చర్ రంగంలో మొదటి సంవత్సరం మాస్టర్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ ఎంవీఏలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాడానికి ఆగస్టు 7తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. అర్హత పరీక్ష ఆగస్టు 11న ఉదయం 11 గంటలకు జరుగుతుంది. మధ్యాహ్నం 2గంటల వరకు వ్యక్తిగత ఇంటర్వ్యూ జరుగుతుంది. ఆసక్తిగల అభ్యర్థులు ఈ కింది 0821-2438931 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

భాగ్యలక్ష్మి యోజన నిధులకు..

2006-07 సంవత్సరంలో భాగ్యలక్ష్మి యోజన కింద క్లైయిమ్ పొందని హగరిబొమ్మనహళ్లి నమోదైన లబ్ధిదారులకు, 2007-08 సంవత్సరంలో భాగ్యలక్ష్మి యోజన మొత్తాన్ని పొందడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చైల్డ్‌డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006-07లో భాగ్యలక్ష్మి యోజన కింద నమోదు చేసుకున్న లబ్ధిదారులలో 60 మంది లబ్ధిదారులు ఇంకా క్లైయిమ్ దరఖాస్తులను సమర్పించడానికి అవ సరమైన పత్రాలతో హాజరు కాలేదన్నారు. ప్రభుత్వం యొక్క ప్రయోజనాలు అర్హత కలిగిన లబ్ధిదారులందరికి చేరాలి కాబట్టి భాగ్యలక్ష్మి యోజన కింద క్లైయిమ్ పొందన 18సంవత్సరాలు నిండిన 2007-08లో నమోదు చేసుకున్న ఇతర అర్హత నింబంధనలను నెరవేర్చిన లబ్ధిదారులు స్థానిక చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్ ఆఫీసర్ కార్యాలయాన్ని సందర్శించి అర్హత గల పత్రాలను అందజేయాలని కోరారు.

బాలల కేంద్రం భవనానికి..

జిల్లాలో 50 మంది చిన్న పిల్లలకు, 50 మంది పెద్ద పిల్లలకు వసతి కల్పించే బాలల గృహాలను ప్రారంభించడానికి మహిళ, శిశు అభివృద్ధి శాఖ జిల్లాల బాలల రక్షణ విభాగం అద్దె ప్రతిపాదకన భవన యజమానుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. నగరంలో 60,40 చదరపు మీటర్ల గ్రౌండ్ ఫ్లోర్, పై అంతస్తు భవనాల యజమానులు ఆగస్టు 5లోపు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కార్యాలయంలో పత్రాలు అందజేయాలని కోరారు.

రైతు ఆత్మహత్య


వీరారెడ్డి (ఫైల్)

బళ్లారిరూరల్, జూలై28 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని కప్పగల్లు గ్రామంలో అప్పుల బాధతో రైతు వీరారెడ్డి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు వీరారెడ్డికి గ్రామీణ బ్యాంకులో రూ.3.50 లక్షల అప్పుతో పాటు మరికొందరితో రూ.8 లక్షలకు పైగా అప్పులు అయ్యాయి. సమయానికి వర్షాలు రాక అప్పులు మరింత ఎక్కువ అయ్యాయి. సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని పరామర్శించిన కర్ణాటక రైతులు సంఘం నాయకులు మాధవరెడ్డి కుటుంబానికి సంతాపం తెలుపుతూ వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

2 నుంచి బళ్లారి రాఘవ జయంత్యుత్సవాలు

● సిద్ధమవుతున్న రాఘవ కళామందిర్ ● తెలుగు, కన్నడ కళాకారులకు రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానం



బళ్లారి సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): కళాప్రపూర్ణుడుగా ప్రసిద్ధిగాంచిన బళ్లారి రాఘవ 145వ జయంతి ఉత్సవాలు ఆగస్టు 2, 3 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ప్రకటించింది. ఉత్సవాలను శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నాగరాజు ప్రారంభించనుండగా, ముఖ్య అతిథులుగా జానపద గాయకుడైన పిచ్చళీ శ్రీనివాస, సభాధ్యక్షుడిగా కే.చెన్నప్ప అధ్యక్షులుగా పాల్గొననున్నారు. తొలిరోజు కళాసంఘం సంస్థ దారవాడ బృందంచే సమరసింహ సంగోళిరాయణ్ణ కన్నడ చారిత్రక నాటకాన్ని ప్రదర్శన ఉంటుందని చెప్పారు. 3వ తేది రాఘవ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. కోటేశ్వర్‌రావు అధ్యక్షతన ముఖ్య అతిథులుగా సురవం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ చెందిన ఆచార్య వెలిదండ నిత్యానందరావు ముఖ్య అతిథులుగా, గౌరవ అతిథిగా గుమ్మడి గోపాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు నాటక అకాడమీ తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

కళాకారులకు రాష్ట్రస్థాయి ప్రశస్తిపురస్కారం

జానపద గాయకుడైన పిచ్చళీ శ్రీనివాస్‌కు కర్ణాటక రాష్ట్రం నుంచి రాఘవ మెమోరియల్ తరఫున రాష్ట్ర స్థాయి ప్రశస్తి పురస్కారాలన అందించనున్నారు. అలాగే తెలుగు నాటక అకాడమీ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గుమ్మడి గోపాలకృష్ణ ప్రశస్తి ప్రధానం చేస్తున్నట్లు తెలిపారు. శ్రీరామ్ పౌండేషన్, శ్రీసాయి బాబ నాట్య మండలి ఆధ్వర్యంలో జయహో శ్రీఛత్రపతి శివాజీ అనే చారిత్రక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు రాఘవ మెమోరియల్ తెలిపింది. రెండు రోజులుపాటు జరిగే జయంతి వేడుకలకు సిద్ధం చేస్తున్నారు.


ఏడుపడగల నాగప్ప


పేట బసవేశ్వరస్వామి


దొడ్డ బసవేశ్వరస్వామి


హోసూరులో మహిళల పూజలు

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

బళ్లారి సిటీ/కంప్లి/హోసూరు జూలై28(ఆంధ్రజ్యోతి) : కంప్లి కురుగోడు తాలుకాలో గ్రామాల్లో శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. నాగదేవతలకు పుట్టలో పాలు పోసి మొక్కులు సమర్పించుకున్నారు. బుక్కసాగర గ్రామం వద్ద ఏళుపడగల నాగప్ప ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కంప్లి పట్టణంలోని పేట బసవేశ్వరస్వామికు రుద్రాక్షలతో అలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. కురుగోడు దొడ్డ బసవేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేపట్టి పూజలు జరిపారు. ఎమ్మిగనూరు గ్రామంలో జడే సిద్దేశ్వరకు ఆకుపూజలు, బిల్వార్చన, అమృతాభిషేకం తదితర పూజలు జరిపారు. ఏ ఆలయంలో చూసినా రద్దీగానే భక్తులతో కిటకిటలాడాయి. కొన్ని ఆలయాల్లో భక్తాదులకు అన్నదానాలు చేపట్టారు. ఈ శ్రావణమాసంలో ప్రతిరోజు పూజలు జరుపుకుంటారు.


నాగదేవతకు పాలు పోస్తున్న మహిళలు

● చిన్నతక్కపల్లి నాగవనంలోని అరుళ్మిగు నాగమ్మదేవత ఆలయంలో 17వ క్షీరాభిషేకంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన గ్రామస్తులు పాలబిందెలతో చేరుకుని అభిషేకం చేశారు. చిన్నతకపల్లి, పెరియతక్కపల్లి, కల్లియూర్, కంపంపల్లి, ఒడియూర్, కరడియూర్ సహా 52 గ్రామాలకు చెందిన ప్రజలు, ఏపీ, కర్ణాకట ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ


చిన్నారులకు బ్యాగులు అందజేస్తున్న నేకార సభ్యులు

బళ్లారిరూరల్, జూలై28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని అనంతపురం రోడ్డు సమీపంలో ఉన్న నేకార సొసైటీకి చెందిన విద్యార్థులకు సోమవారం సంఘం నాయకులు సుధాకర్ దేశ నేతృత్వంలో పెన్నులు, పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బ్రహ్మయ్య, హ్యాండ్‌లూమ్ సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణ, బళ్లారి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎంఎస్ మంజుళ తదితరులు పాల్గొన్నారు.

పదాధికారుల నియామకం

బళ్లారిరూరల్, జూలై28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డు సెంట్రల్ లైబ్రరీ ప్రజ్ఞా సమీపంలో సోమవారం పదాధికారుల ఎంపిక జరిగింది. కర్ణాటక రాష్ట్ర బాల సాహిత్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమోహన్ జిల్లా అధ్యక్షుడిగా ఉత్తీర్ణులై జారీ చేశారు. గౌరవాధ్యక్షుడిగా ఉప్పర మల్లప్పను ఎంపిక చేశారు. వీరిని సాహిత్య మండలి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. మంజునాథ ధరూరు, శాంతనగౌడ ధరూరు, పురుషోత్తమ గౌడ, శేఖర్ డీఎస్ఎస్ మహిళా అధ్యక్షులు శాంతమ్మ పాల్గొన్నారు.


గౌరవాధ్యక్షుడు ఉప్పర మల్లప్పను సన్మానిస్తున్న పదాధికారులు

వైద్యుడిని నియమించాలని వినతి

కంప్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): కురుగోడు సమీపంలోని ముష్టిగట్టి గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పర్మినెంట్ వైద్యుడిని నియమించాలని ఏఐకేకేఎంఎస్ రైతు ప్రజలు సంఘ సంస్థ నాయకత్వంలో కురుగోడు పట్టణంలో సోమవారం నిరసన తెలిపారు. వైద్యుడి నియామకం కోసం ఆరోగ్యశాఖ తాలుకా నోడల్ అధికారులు వీరేంద్ర కుమార్ ద్వారా గౌరవనీయ జిల్లా ఆరోగ్య అధికారులకు ఒక మనవిపత్రాన్ని సమర్పించారు. ఈ అభ్యర్థనకు ప్రతిస్పందిస్తూ జిల్లా ఆరోగ్యాధికారులు డీఎల్‌వో, రైతులతో ఆరోగ్య కేంద్రం లోపాలను చర్చించారు. ఈ చర్చలో వైద్యుడి ప్రధాన సమస్య కనుగొనబడింది. వారు దానిని వెంటనే డీహెచ్‌వోతో చర్చించి వారానికి ఆరు రోజులు వైద్యుడిని నియమిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐకేకేఎంఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్, కార్యదర్శి గురల్లి రాజా, యూనిట్ కన్వీనర్ పంపనగౌడ్, కో కన్వీనర్ వీరణ్ణగౌడ్, సభ్యులు బుద్ధనగౌడ్, హనుమంతప్ప, అర్జున, తిమ్మనగౌడ, రుద్రప్ప పాల్గొన్నారు.


డీఎల్‌ఓ వీరేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శోభారాణి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

● ముగ్గురికి గాయాలు.. దేవినగర్ క్యాంపు వద్ద ఘటన

బళ్లారి, జూలై 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. టెక్కలకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం కారు, లారీ ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ఊనరే బసవరాజు, శేఖర్ గౌడ, దేవప్ప, శంభులింగ, జయలక్ష్మి ఐదుగురు కారులో ప్రయాణిస్తున్నారు. బళ్లారి వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో బసవరాజు(45), శేఖర్‌గౌడ (50) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. దేవప్ప, జయలక్ష్మీ, శంభులింగ తీవ్ర గాయాలకు గురయ్యారు. వారిని చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్‌కు తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎస్పీ శోభారాణి ఇతర అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదమ్ముల మృతి ..

బంగారపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం, ప్రైవేట్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో అన్నదమ్ములు మృతిచెందారు. తాలూకాలోని కోలారు మెయిన్‌రోడ్డు బావరహళ్ళి సమీపాన ద్విచక్రవాహనం, ప్రైవేట్ బస్సులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. తాలూకాలోని కామసముద్ర హోబళి బోయినహళ్ళికి చెందిన మంజునాథ, మంజుళ దంపతుల కుమారులు మదన్ (28), ఉమేశ్ (26) మృతి చెందారు. అన్నదమ్ములు ఇద్దరూ కోలారులోని ఒక బేకరీలో పనిచేసేవారు. ఆదివారం తెల్లవారుజామున పనికోసం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఉమేశ్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన మదన్‌ను స్థానికులు కోలారులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక మృతి చెందాడు. ప్రమాదంపై బంగారపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఓపెన్ స్కూల్ సెంటర్ మంజూరు

రొద్దం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఓపెన్ స్కూల్ సెంటర్ మంజూరైనట్లు ఎంఈఓ జయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, వ్యాపారాలు కొనసాగించే వారికి టెన్త్, ఇంటర్ పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. సెలవు రోజుల్లో తరగతులను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంటర్, టెన్త్ చేరే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని వివరించారు. 14ఏళ్ల నిండినవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 9959516301 నంబరులో సంప్రదించాలన్నారు.

కన్నడ కోకిల అవార్డు అందుకున్న లక్ష్మీదేవి


అవార్డు అందుకుంటున్నలక్ష్మీదేవి

హోస్పేట,జూలై28(ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్ర రచయితల సంఘం ఫ్లవర్ బోట్, జిల్లా యూనిట్ చిక్కమగళూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిక్కమగళూరులోని కన్నడ భవన్‌లో రాష్ట్ర స్థాయి గానం అవార్డు ప్రధానోత్సవంలో కన్నడ కోకిల అవార్డు ప్రధానం చేశారు. కర్ణాటక రాష్ట్ర రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధునాయక్ లంబాని, కర్ణాటక గాత్ర గాన పోటీలో గెలిచిన 34 మంది గాయకులకు అవార్డులు అందజేశారు. వీరిలో విజయనగరం జిల్లా హోస్పేట తాలూకా దన్నానాయకన కెరె గ్రామానికి చెందిన హెచ్ లక్ష్మీదేవి కన్నడ కోకిల అవార్డు అందుకుంది. లక్ష్మీదేవికి అవార్డు పట్ల పలువురు అభినందించారు. రాష్ట్రస్థాయి అవార్డుతో గ్రామానికి పేరు తెచ్చి పెట్టిందని పలువురు అభినందించారు. ఎంపిక ప్రక్రియ కర్ణాటక రాష్ట్ర రచయితల సంఘం, ఫ్లవర్ బోట్, జిల్లా యూనిట్ చిక్కమగళూరు సంయుక్తంగా సోషల్ మీడియాలో గాయకులను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించారు. ఇందులో రాష్ట్రం నుంచి వంద మందికి పైగా గాయకులు పాల్గొన్నారు. పాడినపాటలను నిపుణులైన జ్యూరీ సమీక్షించి విజేతలను ఎంపిక చేసింది.

మహిళల సమస్యలపై నిరంతర పోరాటం

● రాష్ట్ర జనవాది జాయింట్ సెక్రటరీ చంద్రకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకుమారి

బళ్లారి సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని మహిళల సమస్యల పరిష్కానికి అఖిల భారత జనవాది మహిళా సంఘం అండగా ఉంటుందని రాష్ట్ర జనవాది మహిళా కమిటీ జాయింట్ సెక్రటరీ చంద్రకుమారి అన్నారు. సోమవారం బళ్లారి సమీపంలోని సిడిగనమోళ గ్రామంలో ఏర్పాటు చేసిన మహిళా సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ ఆగస్టు 6న బళ్లారి జిల్లా సమావేశం నిర్వహిస్తున్నట్లు, దానిలో భాగంగా జనవాది మహిళా సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఆ ప్రాంతంలోని మహిళల తరఫున వివిధ సమస్యలను పరిష్కరించడానికి పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో సంస్థను విస్తరించడానికి ఒక ప్రణాళికను రూపొందించారు. సిడిగనమోళ గ్రామ జేఎంఎస్ కమిటీకి ఫరీదా బాను అధ్యక్షురాలిగా, భాగ్యలక్ష్మి కార్యదర్శిగా, రాజేశ్వరి కోశాధికారిగా, 8మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వరలక్ష్మి, లక్ష్మి తదితర నేతలు పాల్గొన్నారు.

గుడారా నగర్‌ను సందర్శించిన కేఆర్‌ఎస్ బృందం

బళ్లారి సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): కేఆర్‌ఎస్ పార్టీ బృందం బళ్లారిలోని గుడార ప్రాంతంలో పర్యటించి, అక్కడి మౌలిక సౌకర్యాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సోమవారం వార్డులో పర్యటించిన సభ్యులు అనంతరం మీడియాతో మాట్లాడుతూ సుమారు 22 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్నా సరైన నీటి వ్యవస్థ లేదని, రోడ్లు శౌచాలయాలు లేవన్నారు. అక్కడి ప్రజలు తమ సమస్యలను పీడీఓ మంజునాథ్ కు చెప్పుకున్నా చర్యలు శూన్యమన్నారు. ఇళ్లు లేక కొంత మంది నిరాశ్రయులయ్యారని, అక్కడ సరైన బస్‌స్టాప్ కూడా లేదన్నారు. మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందని, గుడారా నగరం శ్రీధర్‌గడ్డ పంచాయితీకి చెందిందని వెంటనే పీడీఓ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా కేఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ యూనిట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, బళ్లారి జిల్లా కార్యదర్శులు జాన్, కట్టెబసప్ప, జనార్దన్‌రెడ్డి, గోనాల్ రవి తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్


సమస్యలను ఆలకిస్తున్న ఎమ్మెల్యే మునిస్వామి

సమస్యలు ఆలకించిన ఎమ్మెల్యే

హోసూరు రూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): వేపనహళ్ళి నియోజకవర్గ పరిధిలోని తుపుకనపల్లి పంచాయతీ పరిధిలోని చిన్నబేతికనపల్లిలో అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ, ఎమ్మెల్యే కేపీ మునిస్వామి సోమవారం ప్రజల సమస్యలు ఆలకించారు. తాగునీటి సదుపాయం, స్మశానవాటిక, బస్సు సౌకర్యం, మురుగు కాలువ, విద్యుత్ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పలువురు స్థానిక సమస్యలపై వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం, మాదేశ్, బాబు వెంకటాచలం, పంచాయతీ మాజీ అధ్యక్షులు, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

దివ్యాంగుడి దాతృత్వం

గోరంట్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం ప్రాథమిక పాఠశాల కోసం రూ. 20వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను సోమవారం దివ్యాంగుడు చాకలి ముద్దుశివప్ప ఇచ్చారు. పాఠశాల అభివృద్ధి కోసం హెచ్ఎం నీలం అశోక్ విద్యార్థుల తల్లిదండ్రుల సహకారాన్ని కోరారు. ఈ నేపథ్యంలో తాను కష్టపడి సంపాదించిన డబ్బుతో మైక్‌సెట్, ఆంప్లిఫైర్, బ్యాటరీలను పాఠశాలకు ముద్దుశివప్ప బహూకరించారు.

విద్యార్థికి వీల్‌చైర్...

గోరంట్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో 10వ తరగతి చదవుతున్న నాగార్జునకు పూర్వ విద్యార్థి పూసల వెంకటరమణ వీల్‌చైర్ సమకూర్చారు. స్నేహితుడు ఫక్రుద్దీన్ ద్వారా వీల్ చైర్‌ను పాఠశాలలో హెచ్ఎం ఈశ్వర్‌ప్రసాద్ సమక్షంలో విద్యార్థికి సోమవారం అందించారు.

తీయని లాభాలు

● ఖర్జూరాల సాగుతో రూ.లక్షలు గడిస్తున్న రైతు ● సౌదీ నుంచి ప్రత్యేక విత్తనాలు


ఖర్జూర గుత్తులు


దిగుబడిని చూపుతున్న రైతు ఈశ్వరన్

హోసూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): పూలసాగు, కూరగాయల సాగులో పేరొందిన కృష్ణగిరి జిల్లా ఇటీవల ఖర్జూరాల దిగుబడిలోనూ ప్రత్యేకత చాటుకుంది. అరబ్ దేశాలకే పరిమితమైన ఖర్జూరాల సాగు ఇక్కడ కూడా ఉండడం ఆదరణ అభిస్తోంది. ఇతర పంటలతో పోలిస్తే తక్కువ ఖర్చు, ఎక్కువ లాభం ఉంటోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖర్జూరాల సాగును లాభదాయక సాగుగా ఉండేలా ప్రోత్సహించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. కృష్ణగిరి సమీపంలోని తవళం గ్రామానికి చెందిన రైతు ఈశ్వరన్ టమోటాలు, వరి, అరటితో సహా వివిధ రకాల పంటలను పండిస్తున్నాడు. సాధారణ పంటలతో చెప్పుకోదగ్గ లాభం లేదని భావించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాడు ఇందులో భాగంగా స్నేహితుడి సలహా మేరకు సౌదీ నుంచి ఖర్జూర మొక్కలు కొనుగోలు చేసి సహజ వ్యవసాయం ద్వారా వాటిని సాగు చేశాడు. మొక్కలు నాటిన రెండున్నరేళ్లకే కోతకు రావడం, ఏడాదికి రెండు కోతలు సాధ్యమవుతోందన్నారు. కిలో రూ.150 చొప్పున ఇక్కడి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి దిగుబడి బాగుందని, ప్రతి గుత్తికి 10-20 కిలోల దాకా ఉంటుందన్నారు. ఒక ఎకరా ప్రదేశంలో ఖర్జూరం ప్రారంభించగా క్రమేపీ విస్తరిస్తున్నట్టు తెలిపారు. కాగా ధర్మపురి జిల్లాలోనూ ఖర్జూరాల సాగు అవుతోందని తెలుస్తోంది.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

రొళ్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని దొడ్డేరి గ్రామానికి చెందిన తిప్పన్న, సన్నరంగప్ప, ఓబుళమ్మ, హనుమంతరాయప్పలను సోమవారం పిచ్చికుక్క కరిచింది. స్థానికులు వెంటనే రొళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కాగా పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే కుక్కల బెడద ఉంటోందని, సంబంధిత అధికారులు స్పందించి వాటి బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. తరచూ కుక్కలు దాడి చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు.